క్లుప్తంగా

ఆటో డ్రైవర్స్ కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన మండల కమిటీని గురువారం మండల కేంద్రంలోని ఆర్అండ్ బీ అతిథి గృహంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సందెల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా మామిడి అయిలయ్య, పుర్మ రాంబాబు, పస్తం అయిలయ్య, ప్రధాన కార్యదర్శిగా బొలుగుల లక్ష్మణ్, కార్యదర్శిగా తవిటి భాస్కర్, చిలుముల రమేష్, గుంటిపల్లి శోభన్, కోశాధికారిగా యాకూబ్‌పాషా, ఆర్గనైజర్ చందు, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి. శ్రీధర్, నాగేష్, సత్యనారాయణ, కరుణాకర్, సిద్దులు, బాలరాజు, కనుకయ్య, శ్రీనివాస్, భిక్షపతిలను ఎన్నుకున్నారు.

వివాహానికి సర్పంచ్ సాయం



సాయం అందజేస్తున్న సర్పంచ్

చిల్పూరు: లింగంపల్లి గ్రామానికి చెందిన రాచకొండ పుల్లయ్య- సరోజన కూతురు దివ్య, ఆకారపు రాజయ్య- పద్మల కూతురు కల్పన వివాహం గురువారం జరుగగా రెండు కుటుంబాలకు స్థానిక సర్పంచ్ రవీందర్ రూ.5,016 చొప్పున అందజేశారు. ఈసందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో పేదింటి ఆడపడుచు వివాహానికి రూ.5,016, గ్రామంలో ఎవరైనా మృతి చెందితే రూ.2వేలు అందిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా రెండు కుటుంబాలకు సాయం అందించినట్లు సర్పంచ్ రవీందర్ తెలిపారు.

పరీక్షలు సజావుగా కొనసాగించండి

దేవరుప్పుల : నిబంధనల మేరకు ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా కొనసాగేలా నిర్వాహకులు కృషిచేయాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించి, ప్రథమ చికిత్స సిబ్బందితో మాట్లాడారు. అనంతరం రైతు వేదిక పక్కనే గల తెలంగాణ క్రీడా మైదాన ప్రాంగణం బోర్డుకే పరిమితం కావడంతో తానే స్వయంగా సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకొని ఎంపీడీఓ సురేష్‌కుమార్‌తో వాకబు చేశారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మండల నోడల్ అధికారి ఉపేందర్, ప్రిన్సిపాల్ రాపోలు ప్రభాకర్, ఆర్‌ఐ రాజు ఉన్నారు.

ఎంపిక



వీక్షిత

జనగామ రూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్టులో జనగామ పట్టణంలోని ధర్మకంచ పాఠశాలకు చెందిన వి.వీక్షిత అర్హత సాధించి జిల్లా స్థాయిలో మూడో స్థాయిలో నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్గం ప్రకాశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినికి ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగేళ్లపాటు అందనుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా గైడ్‌గా వ్యవహరించిన ఉమారాణి, బాలరాజు ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే శిక్షణ ఇచ్చిన వందేమాతరం ఫౌండేషన్‌కు కృతజ్ఞత తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుంపల సంపత్ గురువారం ఆర్ అండ్‌బీ అధికారులను ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల పాలకుర్తి రోడ్డు వేడల్పుతో పాటు జనగామ నుంచి తొర్రూరు, స్టేషన్‌ఘనపూర్ నుంచి మొండ్రాయి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం జరగడంతో వాహనాల రద్దీ పెరిగిందని తెలిపారు.

సర్పంచ్‌కు పరామర్శ



నివాళులర్పిస్తున్న కడియం

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట సర్పంచ్ బొట్టు మానస భర్త నరేందర్ ఇటీవల మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సర్పంచ్ మానసను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం నరేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసింహచారి, నాయకులు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, పేరాల సుధాకర్, బొట్టు చేరాలు, సాదం భీమయ్య, జీడి ఆనందం, జాన్, అశోక్‌పాల్, గుర్రం యాదగిరి ఉన్నారు.

గ్రామాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రామన్నగూడెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని రామన్నగూడెంలో నూతన పంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో ఏ ఒక్కరు కంటి చూపు సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. 18 ఏళ్లు పై బడిన వారంతా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ భవనానికి 30 గుంటల భూమి విరాళం ఇచ్చిన స్థల దాత రంగరాజు రంగారావును ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హాషీం, ఎంపీటీసీ గూడెల్లి శిరీష, ఉప సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేష్, ప్రధాన కార్యదర్శి ముసిపట్ల విజయ్, వార్డు సభ్యులు ఎంపాల శ్రీనివాస్‌రెడ్డి, సత్యలక్ష్మి, మంజుల, శిరీష, డాక్టర్ శ్రీతేజ, బికునాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, మడ్లపల్లి సునిత, కేమిడి రమ్య తిప్పారపు మమత, రమ్య, బిర్రు మధు, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు నూనెముంతల యాకస్వామి, అతని సోదరుడు రమేష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు.

ప్రయోగాత్మక విద్యతోనే కొత్త ఆవిష్కరణలు



జ్ఞాపికలను అందజేస్తున్న అదనపు కలెక్టర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

● అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

దేవరుప్పుల : ప్రయోగాత్మక విద్యతోనే భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణిస్తూ కొత్త ఆవిష్కరణలు సాధించేందుకు సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం వార్షికోత్సవం పురస్కరించుకొని విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షత వహించగా అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాల వార్షిక నివేదికను ఆవిష్కరించిన ఆయన విద్యార్థుల పురోగతిపై స్పందిస్తూ మారుమూల పల్లెల్లోనే ఆణిముత్యాలు తయారవుతాయన్నారు. పాఠశాల యాజమాన్యం జిల్లా స్థాయికి తీసిపోని విధంగా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించే ప్రదర్శనలు ఆచరణీయమవుతాయన్నారు. నేర్చుకోవడంలోనే సృజనాత్మకత, సృజనాత్మకతతోనే ఆలోచన జ్ఞానం పెంపొందుతుందన్నారు. మానవుడిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దే ఆయుధం విద్యయేననీ అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్‌తోపాటు అతిథులను పాఠశాల యాజమాన్యం సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ రాము, ఎంపీపీ బస్వ సావిత్రి, జెడ్పీటీసీ పల్ల భార్గవి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, పరీక్షల విభాగం జిల్లా కోఆర్డినేటర్ బయ్యా అర్జున్‌కుమార్, నోడల్ అధికారి సీహెచ్ ఉపేందర్, ఎంపీటీసీ మేడ కల్యాణి, మదన్‌మోహన్, ఖాజా, రమాదేవి, మధు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగాలఘణపురం: మండలంలోని కుందారం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. డీఈఓగా ఎం.ఈశ్వర్, ఎంఈఓగా స్వప్న, హెడ్మాస్టర్‌గా శ్రావ్య వ్యవహరించారు.

అంగడి వేలం ప్రకటన

పాలకుర్తి: పాలకుర్తి మండల కేంద్రంలోని అంగడి వేలం ప్రకటన కోసం డిపాజిట్లు చెల్లించాలని సర్పంచ్ వీరమనేని యాకాంతరావు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2003–2004 సంవత్సరం వేలం పాటలు నిర్వహిస్తామని తెలిపారు. మేకలు, గొర్రెలు, దుకాణంకు రూ.1 లక్ష డీడీల నగదు చెల్లించాలని తెలిపారు. తై బజారు వేలానికి రూ.50 వేలు నగదు, పశువులు, రహదారి వేలం నిర్వహించడానికి రూ.40 వేలు నగదు డిపాజిట్ చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్‌ను ఆమోదించడానికి ఏప్రిల్ 2003 నుంచి ఏప్రిల్ 4 నుంచి 2004 వరకు సమయం ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. డీడీలను గ్రామ పంచాయతీ పేరుతో చెల్లించాలన్నారు. అంగడి నమోదు కోసం డీడీలతో పాటు రూ.100 పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరాచారి పేరు మీద చెల్లించాలని కోరారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న లింగం

జనగామ: జనగామ పట్టణం బాణాపురం చిట్యాల ఐలమ్మ నగర్ ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులు రిలేదీక్షలు గురువారం 34వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కల్యాణం లింగం మాట్లాడుతూ.. సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు తమకు డబుల్ బెడ్‌రూంలు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో పిట్టల శారద, ఎర్ర రజిత, పాముకుంట్ల చందు, పొన్నాల ఉమ, గంధ్ర చంద్రశేఖర్, మచ్చ వరలక్ష్మి, కూకట్ల యాకయ్య, కత్తి మల్లమ్మ, బాల్దె స్వరూప, రాజు, పద్మ, సంరిన్, శ్రామిక తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ‘జేరిపోతుల’



అవార్డు అందుకుంటున్న పరుశరామ్

జనగామ: కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కేంద్ర సామాజిక సేవా అవార్డును అందుకున్నారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా కేంద్ర సాహిత్య అకాడమీ, ఆది లీల ఫౌండేషన్ సంయుక్తంగా గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరావు, ఆదినారాయణ తదితరులు పరశురామ్‌కు అవార్డు అందజేశారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



లక్ష్మాపూర్‌లో శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంత ప్రజలు అంధత్వ నివారణకు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను వినియోగించుకోవాలని మండలంలోని లక్ష్మాపూర్ సర్పంచ్ నూకల నవ్య అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాత్రి తిరుపతి, డాక్టర్ రమ్య, ఆఫ్తాల్మిక్ ప్రవీణ్, సిబ్బంది హబీబ్, నూకల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పల్లెల ముంగిట కంటివెలుగులు

దేవరుప్పుల : కంటివెలుగును ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని ధర్మగడ్డతండాలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ సునితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు యేల అనిల్‌కుమార్, ఆప్తాల్మిస్టు బొబ్బిలి, డీఈఓ భద్రి, హెల్త్ సూపర్‌వైజర్ భాగ్య, ఎఎన్ఎం జ్యోతి, సుజనా, నల్ల యాదగిరి, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అనిల్ రాథోడు, అంగన్‌వాడీ టీచర్ నల్ల స్వరూప పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం

ఖిలా వరంగల్: హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా భారత కార్మికవర్గంపోరాడాలని విప్లవ కార్మిక సంఘాల ఐక్యవేదిక (మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్ - మాస), ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు, ఢిల్లీ కార్మిక ఉద్యమ నాయకురాలు సుష్మ అధ్యక్షతన రెండో రోజు గురువారం జరిగిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజాస్వామిక వ్యవస్థలు సంక్షోభంలో నెట్టివేయబడ్డాయని వాపోయారు. మైనార్టీ, ఆదివాసీ ప్రజలపై ఆర్ఎస్ఎస్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు దాడులు చేస్తూ హత్యాకాండ సాగిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం తెచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ నేతలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

తరిగొప్పుల: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్ రెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అంకుషాపూర్‌లో శక్తి కేంద్రాల ఇంచార్జ్, బూత్ అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముక్కెర తిరుపతిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, బండ ప్రసాద్, తలకొక్కుల శ్రీనివాస్, కర్రె పోషయ్య, ప్రవీణ్ నాయక్, అల్వతి నాయక్, పోగుల ఎల్లయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిలో రెడ్డి దాబా వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లికి చెందిన కొలిపాక కుమారస్వామి- పద్మ దంపతులు పని నిమిత్తం ద్విచక్రవాహనంపై స్టేషన్‌ఘన్‌పూర్‌కు బయల్దేరారు. రెడ్డి దాబా సమీపంలో యూ టర్న్ తీసుకుంటుండగా ఘన్‌పూర్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ద్విచక్ర వాహనం వీరిని ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కంచి రమేష్ అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. అదే సమయంలో హనుమకొండ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే రాజయ్య, బీజేపీ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అక్కడే ఉన్న సర్పంచ్‌లు లింగారెడ్డి, రవీందర్ గాయపడ్డ వారిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తికి..

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలం నుంచి చేర్యాల పట్టణం వరకు జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డు పక్కన తీసిన గుంతలో పడడంతో మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన మూసిని సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుధాకర్ గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం చేర్యాలకు వెళ్తుండగా వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ వద్ద రోడ్డు పక్కన తీసిన గుంతలో ప్రమాదవశాత్తు పడి తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రోడ్డు మరమ్మత్తు పనుల్లో భాగంగా రోడ్డు పక్కన గుంతలను తీసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు వాటిని పూడ్చకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు పనులను చేపట్టి ప్రమాదకరమైన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

గాయపడిన వ్యక్తి

లింగాలఘణపురం: జనగామ - సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలైన బండ్లగూడెంకు చెందిన ముస్కు సత్తిరెడ్డి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. సత్తిరెడ్డి సైకిల్‌పై జనగామ నుంచి బండ్లగూడెం వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు బలమైన గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు.

అర్హులకే ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న విజేందర్, తదితరులు

తరిగొప్పుల: నర్మెట మండలంలోని వెల్దండ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మరోసారి విచారణ చేపట్టి అర్హులకే కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం విజేందర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో ప్రజాప్రతినిధులు, అధికారులు అనర్హులకు ఇళ్ల కేటాయిస్తున్నారని తెలిపారు. ఇళ్లు లేని పేదలకు కాకుండా వ్యవసాయ భూములు, ట్రాక్టర్లు ఉన్న వారిని ఎంపిక చేయడం దారుణమన్నారు. లబ్ధిదారులు ఎంపిక నిబంధనల ప్రకారం జరగలేదని తెలిపారు. నర్మెట మండల తహసీల్దార్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీ నాయకులకు తొత్తుగా మారి ఎమ్మెల్యే గెస్ట్ హౌజ్‌లో లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆరోపించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాధిక, కొంరయ్య, సావిత్రి, అనిత, ఎల్లమ్మ, కళావతి, సత్తయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

జనగామ రూరల్: జనగామ పట్టణ ఆర వైశ్యసంఘం అధ్వర్యంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం మహాసభ అధ్యక్షుడు హరిశ్చంద్ర గుప్త శ్రీరాములు చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, ఆవోపా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, జయహరి, జైన రమేష్, శ్రీధర్, శివరామకృష్ణ, శ్రీనివాసులు, సంతోష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బ్యాగులు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

జనగామ రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడంలో సమాజంలో ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందని వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మేకల బాలసిద్ధయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుగుణంగా మనిషి జీవితం ఉండాలని, వాతావరణం కలుషితం అయితే రాబోయే తరాలకు ఇబ్బందులు తప్పవని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, వాటి స్థానంలో జ్యూట్ బాగులు వాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సేవా సమితి తరఫున జ్యూట్ బ్యాగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దొంతు శేఖర్, ఫకీర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బచ్చన్నపేట: జాతీయ గ్రామీణ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని అప్పుడే సరియైన గిట్టుబాటు డబ్బులు వస్తాయని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని సాల్వాపూర్‌లో ఈజీఎస్ పనులను, మనసాన్‌పల్లిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జాబ్ కార్డు కలిగి ఉన్నవారందరూ ఈజీఎస్ పనులకు వెళ్లాలని, అలాగే వ్యవసాయ భూములు కలిగి ఉన్న వారు భూ అభివృద్ధి పనులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఉన్న వారు పనులకు వెళ్లేలా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల కూలీలకు అవగాహన కల్పించాలని, కూలీల వివరాలను ఎప్పటికప్పుడు మస్టర్లలో రాయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, మధు, ఫీల్డ్ అసిస్టెంట్, ఈజీఎస్ కూలీలు పలువురు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీఎల్ఎన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అమ్మాపూర్‌లో స్వశక్తి కరణ్ అభియాన్ బూత్ స్థాయి సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల మహేష్, గంగం ప్రభాకర్‌రెడ్డి, నవీన్, సాయినాథ్, మోహన్, శ్రీధర్, దేవేందర్, రాజు, సిద్దులు, సుధాకర్ పాల్గొన్నారు.

నియామకాలు..



యాదయ్య

కొడకండ్ల: వడ్డెర అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గ సమన్వయకర్తగా మండలకేంద్రానికి చెందిన కొడిదల యాదయ్యను నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలయ్య గురువారం ఉత్తర్వులు అందజేశాడు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. సమాజంలో ఉన్నత కులాల వారు అతి చులకనగా చూస్తున్నారని, కులం పేరుతో దూషిస్తే ప్రత్యేక చట్టం తీసుకొచ్చి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. శివరాత్రి వెంకన్న, కుంచం వెంకన్న, యాదయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పులి శ్రావణ్‌కుమార్‌గౌడ్‌ను బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దశమంత రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ సోషల్ మీడియా ఘన్‌పూర్ నియోజకవర్గ కోకన్వీనర్‌గా మండలంలోని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన గాదె శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందించారు.



రఘునాథపల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు మాటూరి భరత్ కుమార్‌గౌడ్‌ను సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా నియమిస్తూ.. ఎమ్మెల్యే రాజయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జాకబ్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు గ్రేస్ ఎస్ జాకబ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. టీచింగ్ ఓరల్ స్కిల్స్ ఎట్ మిడిల్ స్కూల్ లెవల్ ఇన్ ఇండియన్ స్కూల్స్ ఇన్ ఓమన్ : ఏ కేస్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జాకబ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి ప్రకటనలో తెలిపారు.

ఆందోళనకారులకు నోటీసులు జారీ

● వానకొండయ్య గుట్ట పరిరక్షణకు

అఖిల పక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు

దేవరుప్పుల: చారిత్రాత్మక శ్రీ వానకొండయ్య లక్ష్మీ నర్సింహ్మస్వామి గుట్ట పరిరక్షణ కోసం పాటుపడుతున్న ఆందోళనకారులకు క్వారీ కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు జనగామ కోర్టుకు హాజరు కావాలని నోటీసులు జారీ అయ్యాయి. మండలంలోని వానకొండయ్య లక్ష్మీనర్సింహ్మస్వామి గుట్ట ఆనుకొని ఉన్న 37 సర్వే నంబరు(ధర్మాపురం) భాగంలో 4.85 హెక్టార్లలో బ్లాక్ గ్రానైట్ తవ్వకాల కోసం రోహిత్ ఫాల్ మినరల్స్ అసిస్టెంటు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ జనగామ (ప్రొసిడింగ్ నంబరు 1476 క్యూ 2018) ద్వారా గత ఏడాది నవంబర్‌లో 20 ఏళ్ల అనుమతి పొంది 19వ తేదీన పనులు మొదలు పెట్టారు. ఈ విషయమై కడవెండి గ్రామస్తులు దేవునిగుట్టను విధ్వంసం చేయొద్దని, ఉన్నతాధికారులను తాము కలిసే వరకూ ప నులు ఆపమని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మి నరల్స్ మేనేజింగ్ పార్టనర్ నల్లమారి మొగిలిని ఆందోళనకారులు కులంపేరుతో దూషించారని, ఆర్థికంగా నష్టం చేశారని ఆరోపిస్తూ అక్టోబర్ 11న వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో హనుమకొండ అడ్వకేట్ కే.కృష్ణప్రసాద్ ద్వారా జనగామ కోర్టు కడవెండికి చెందిన 14 మందిని ఈ నెల 20న హాజరు కావాలని నోటీసులు జా రీ చేసింది. ఈ దేవునిగుట్టపై గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో పలుసార్లు ఆందోళనకు దిగారు. ఈ విషయమై స్పందిస్తూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇటీవల క్వారీ అనుమతులు రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసిన క్రమంలో ప్రజాప్రతినిధులు, అధి కార, ప్రతిపక్ష పార్టీ నాయకులకు నోటీసులు జారీ కావడంతో తీవ్రచర్చనీయాంశంగా మారింది.